హామీల అమలులో కూటమి కుయుక్తులు

- అబద్ధపు హామీలతో గద్దెనెక్కి.. ప్రజలను వంచించిన బాబు
- ఎన్నికల హామీలను గాలికొదిలేసిన కూటమి సర్కారు



2024 మే 1న చంద్రబాబునాయుడు దెందులూరులో నిర్వహించిన సమావేశం క్లిప్పింగ్ (ఫైల్)

దెందులూరు: అధికారంలోకి వచ్చిన తరువాత ఐదేళ్లపాటు విశ్వసనీయతతో పని చేస్తానని, దెందులూరు నియోజకవర్గంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబు ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క హామీ కూడా అమలు చేయకుండా ప్రజలను తీవ్రంగా వంచించారు. అధికారం కోసం అడ్డదారులు తొక్కడం, అమలు గాని హామీలతో వంచించడం, మాయ మాటలు చెప్పడం, అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య. నేను మారాను నమ్మండి అంటూ మొసలి కన్నీరు కార్చిన చంద్రబాబు మరోసారి ప్రజలను నిలువునా ముంచేశారు. ఏడాది గడుస్తున్నా ఒక్క హామీని కూడా అమలు చేయకపోవడంతో ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఊరురా నమ్మించి, వంచించి, అధికారమే పరమావధిగా భావించిన చంద్రబాబు మారిన మనిషిలా నటించారు. ఇంటింటికీ రేషన్ ఇచ్చే ఎండీయూ వాహనాలను కూటమి ప్రభుత్వం తొలగించింది. దీంతో ప్రతి ఒక్కరూ రేషన్ షాపులకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. శివారు గ్రామాల్లో 85 శాతం రేషన్ షాపులు లేవు. రేషన్ షాపుల ఏర్పాటుపై ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయలేదు. వారంతా రేషన్ తెచ్చుకోవడానికి రానుపోను రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సిందే పైగా ఒక పూట కూలి పని మానుకొని మరీ వెళ్లాలి. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ అభివృద్ధి పథకాలు ఆన్‌లైన్ చేసి ఇంటింటికీ వెళ్లి సేవలందించే వాలంటీర్లను సైతం కూటమి ప్రభుత్వం తొలగించింది. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను కూడా అనేక మందిని కూటమి ప్రభుత్వం తీసేసింది.

అన్నీ దాడులు, దౌర్జన్యాలే

నియోజకవర్గ వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అన్ని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన అభివృద్ధి శిలా ఫలకాలు, మహానేత వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలపై వేధింపులు అక్రమ కేసులు పెడుతూనే ఉన్నారు. శ్రీరామవరంలో పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని ఇంటిని ధ్వంసం చేసి అతడిపై తొమ్మిది కేసులు పెట్టారు. అతడి ఇంటిపై లోకేష్ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. పార్టీ సర్పంచులుగా ఉన్న గ్రామ పంచాయతీలపై సవతి తల్లి ప్రేమ చూపించడమే కాకుండా కొంత మందికి చెక్ పవర్ తొలగించారు. గతేడాది తల్లికి వందనం నగదు బ్యాంకులో జమ కాలేదు. ఈ ఏడాది ఇస్తామంటున్నారు కానీ ఇంకా దానిపై స్పష్టత రాకపోవడంతో పిల్లలను చదివించుకునేందుకు, ఫీజులు కట్టలేక సతమతమవుతున్నారు.

ఒక్క పథకం రాలేదు



ఎన్నికలు జరిగి ఏడాది అవుతున్నా ఒక్క పథకం రాలేదు. జగనన్న ఉన్నప్పుడు ఏదో ఒక పథకం పేరుతో బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అయ్యేవి. ఆ డబ్బులతో ఆదాయం వచ్చేలా మేకలు కొనుగోలు చేసి పెంచుకునే వాళ్లం.

– కె.కృష్ణవేణి, దెందులూరు

జగనన్న ఎంతో మేలు చేశారు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. కూటమి నాయకులు ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చారు. ఇచ్చిన హామీలు ఇంత వరకు నెరవేర్చలేదు. మహిళలకు ఒక్క పథకం కూడా అందించ లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కాలంలో ఇచ్చిన మాట ప్రకారం చెప్పిన తేదీకి ఆసరా, అమ్మబడి, వైఎస్ఆర్ చేయూత వంటి అనేక పథకాలు అందించారు.

– అంగడాల సీతారావమ్మ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు, దెందులూరు

ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు



కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క పథకం కూడా అమలు చేయలేదు. కూటమి ప్రభుత్వం మహిళలను మోసం చేసింది. జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్ల మహిళలకు ఆదరణ పెరిగింది. ఇంట్లో కూడా మహిళలను గౌరవించే వారు పథకాలన్నీ మహిళల పేరుతోనే ఇవ్వడంతో మహిళలు తలెత్తుకు జీవించే పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు అసలు హామీలు అమలు చేస్తారా లేదా అని సందిగ్ధంలో ఉన్నారు.

–సొంగా ప్రమీల, ఎంపీటీసీ గాలాయగూడెం

మా కార్డులు ఎక్కడ ఉన్నాయో తేల్చండి



గుండుగొలనులో తహసీల్దార్ బి.రమాదేవికి ఫిర్యాదు చేస్తున్న వార్డు సభ్యుడు గొటికల మురళి

భీమడోలు: గుండుగొలనులోని 13, 14 వార్డుల్లో రేషన్ కార్డుదారులు ఏ రేషన్ దుకాణానికి వెళ్లి సరుకులు తీసుకోవాలో తెలియడం లేదని, మా కార్డులు ఏ రేషన్ దుకాణానికి అనుసంధానం చేశారో తెలియడం లేదని వార్డు సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నేత గొటికల మురళి తహసీల్దార్ బి.రమాదేవికి మంగళవారం ఫిర్యాదు చేశారు. నిబంధనల మేరకు కొత్త రేషన్ దుకాణాన్ని మంజూరు చేయించాలని ఆయన తహసీల్దార్ వద్ద వాపోయాడు. కొత్త దుకాణం ఏర్పాటు విషయంలో ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని, కార్డుదారులు తమ పరిధిలోని రేషన్ షాపులో సరుకులు తీసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సీఎస్ డీటీ జి.భరత్, వీఆర్వో డి.సింహాచలం, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణతో మలేరియా అదుపు

పెదవేగి: దోమల నివారణతో మలేరియాను అదుపు చేయొచ్చని ఏలూరు జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెదవేగి ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ భార్గవి, అసిస్టెంట్ మలేరియా అధికారి జే.గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎట్టకేలకు రావులపర్రు బ్రిడ్జి నిర్మాణం



రావులపర్రు వద్ద చేస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు

ఉంగుటూరు: ఎట్టకేలకు రావులపర్రు బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారు. రావులపర్రు–ప్రకాశరావుపాలెం ఆర్అండ్‌బీ రహదారికి రావులపర్రు వద్ద ఫత్తేపురం పంట కాలువపై ఉన్న బ్రిడ్జి శిథిలమై పడిపోయింది. నాలుగు సంవత్సరాలుగా ప్రజలు బ్రిడ్జి లేక ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం రూ.70 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. ఫత్తేపురం పంట కాలువకు జూన్ మొదటి వారంలో నీరు వదులుతారని సమాచారం. ఈ నేపథ్యంలో బ్రిడ్జి నిర్మాణ పనులు హడావుడిగా గుత్తేదారు మొదలు పెట్టారు. ఇంజనీరింగు అధికారులు ఎవరూ లేరు. ఆర్అండ్‌బీ ఏఈ భాస్కరరావు, డీఈ గోవింద మోహన్ పర్యవేక్షణలో బ్రిడ్జి నిర్మాణ పనులు చేస్తున్నారు.

గ్రంథాలయాలు.. సరస్వతీ నిలయాలు



భీమడోలు: నీతి కథల పోటీలను పరిశీలిస్తున్న ఎంఈవో-2 అయినపర్తి భాస్కర్ కుమార్

భీమడోలు: గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలని వీటి ద్వారా జ్ఞానాన్ని అర్జించొచ్చని ఎంఈవో–2 అయినపర్తి భాస్కర్ కుమార్ అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులను మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో మమేకమై శిక్షణా తరగతుల్లో నేర్చుకున్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్, విద్యార్థులు, పెద్దలు పాల్గొన్నారు.

కథలో నీతిని ఆచరించాలి

దెందులూరు: కథలో నీతిని విద్యార్థినీ విద్యార్థులు ఆచరించాలని పోతునూరు గ్రంథాలయ అధికారి జి.రాంబాబు, రిసోర్స్ పర్సన్ ఎం.సునీల్ అన్నారు. బుధవారం పోతునూరు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ తరగతులు ముగిసిన తరువాత పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రజా ప్రతినిధులు, అధికారులతో ధృవీకరణ పత్రాలు, నగదు బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి తెలిపారు.

ఘనంగా అన్న సమారాధన



అన్నసమారాధన నిర్వహిస్తున్న దాతలు

పెదపాడు: మండలంలోని అప్పనవీడులో వేంచేసియున్న అభయాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం పురష్కరించుకుని అన్నసమారాధన నిర్వహించారు. 200 మందికి నిర్వహించిన ఈ అన్నసమారాధన కార్యక్రమానికి ఏలూరుకు చెందిన గంగుల ప్రదీప్‌కుమార్, కవిత దంపతులు ఆర్థికసాయం అందించారు. రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ ప్రమాణస్వీకార అనంతరం సొంత జిల్లాకు వస్తూ స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

భగవద్గీత ప్రచారం

దెందులూరు: పోతునూరు గ్రామంలో బుధవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక నూజివీడు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. హిందువులకు భగవద్గీతలను అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు అరుణ్ కుమార్, సభ్యులు కోటేశ్వరరావు, అశోక్, శ్రీకాంత్, రామాంజనేయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పెదపాడు: మండలంలోని వసంతవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆనందోత్సాహాల మధ్య సందడి నెలకొంది. 49 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అంతా ఓ చోట కలుసుకున్నారు. పలు ప్రదేశాల్లో ఉద్యోగ వ్యాపారాల్లో స్థిరపడిన మిత్రులంతా తిరిగి బాల్యంలో విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలలో కలుసుకొని అలనాటి స్నేహానుభూతులను పంచుకున్నారు. 1975–1976 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో పులవర్తి లక్ష్మీనారాయణ, బైరాపట్ల సత్యనారాయణ, కాత్రం సురేష్, శేషగిరి పాల్గొన్నారు.

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ బాబు

వెన్నుపోటు దినం పోస్టర్ల ఆవిష్కరణ



గణపవరం: వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుబాబు

నిడమర్రు: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా వంచించిన సీఎం చంద్రబాబునాయుడు వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ విమర్శించారు. మంగళవారం బువ్వనపల్లి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, జెడ్పీటీసీ కోడే కాశి, కూనపురాజు సందీప్, పుప్పాల మెహర్‌కుమార్, దెందుకూరి త్రిమూర్తిరాజు, ఎండీ షకీల్, వేగేశ్న గోవిందరాజు, రుద్రరాజు అప్పలరాజు, మద్దిరాల బుజ్జి, విశ్వనాధరాజ్, పాల్గొన్నారు.

నేడు వెన్నుపోటు దినం

ఉంగుటూరు: చంద్రబాబు ప్రజలను మోసం చేసిన దానికి నిరసన తెలిపే వెన్నుపోటు దినోత్సవము కార్యక్రమం నియోజకవర్గ కేంద్రం ఉంగుటూరులో నేడు నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మరడ మంగరావు వెల్లడించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ నాయకులు పోస్టరును ఆవిష్కరించారు.

ప్రజలను మోసం చేసిన కూటమి

గణపవరం: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనతో ప్రజలను మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. వెన్నుపోటు దినం నిర్వహణపై పార్టీ నేతలతో వాసుబాబు మంగళవారం చర్చించారు. సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయడం చేతకాక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను అక్రమ కేసులతో వేధించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు.

చంద్రబాబు చరిత్రహీనుడు కాక తప్పదు

భీమడోలు: ఇచ్చిన హామీలను నేరవేర్చని చంద్రబాబు చరిత్రహీనుడిగా మిగిలిపోతాడని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీనివాస్, రాష్ట్ర క్రిస్టియన్ మెనార్టీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, రాష్ట్ర యువజన సెల్ కార్యదర్శి మద్దుల రాజా, జిల్లా అధికార ప్రతినిధి ఇంజేటి నీలిమజూనియర్ అన్నారు. వైఎస్సార్‌సీపీ అధిష్ఠానం పిలుపు మేరకు ఈ నెల 4వ తేదీన ఉంగుటూరులో తలపెట్టిన వెన్నుపోటు దినోత్సవం వాల్‌పోస్టర్‌ను మంగళవారం భీమడోలులో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు గంటా శ్రీను, ఆల్తి గోపి, అంబటి దేవి, ఇంజేటి జూనియర్, షేక్ ఆజమ్, వైఎస్సార్‌సీపీ నాయకులు రామిశెట్టి నాగేశ్వరరావు, తుమ్మల రంగా, పాము మాన్‌సింగ్, అంబటి నాగేంద్రప్రసాద్, రామిశెట్టి శ్రీను, కందులపాటి అయ్యప్ప, పచ్చా బాబి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మాజీ ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ర్యాలీ

దెందులూరు: వైఎస్సార్‌సీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలు, అరాచకాలను నిరసిస్తూ గురువారం వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఈ ర్యాలీలో అందరూ పాల్గొనాలని ఆయన పిలుపు ఇచ్చారు.



భీమడోలు: వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఉంగుటూరు: నిరసన పోస్టర్‌ను ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ నాయకులు



నిడమర్రు: పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్

మర్యాదపూర్వక కలయిక



భువనపల్లిలో మాజీ ఎమ్మెల్యే వాసుబాబును కలిసిన సయ్యద్ ఆజామ్

భీమడోలు: కూటమి సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని భువనపల్లి క్యాంపు కార్యాలయంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును నూతనంగా నియమితులైన నియోజకవర్గ పబ్లిసిటీ విభాగం కన్వీనర్ సయ్యద్ ఆజామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

రేషన్ దుకాణాల తనిఖీ



రేషన్ షాపును తనిఖీ చేస్తున్న తహసీల్దార్ కృష్ణజ్యోతి

పెదపాడు: రేషన్ పంపిణీలో సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకు రావాలని రేషన్ దుకాణదారులను తహసీల్దార్ ఎ.కృష్ణజ్యోతి ఆదేశించారు. మంగళవారం మండలంలోని అప్పనవీడులో తహసీల్దార్ కృష్ణజ్యోతి రేషన్ షాపులను తనిఖీ చేశారు. అనంతరం వారికి తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో రేషన్ దుఖాణదారుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్వోల సమావేశం

కార్యాలయంలో తహసీల్దార్ కృష్ణజ్యోతి వీఆర్వోల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో భూమి శిస్తు వసూళ్లు, కౌలు కార్డుల పంపిణీ వంటి కార్యక్రమాలపై దృష్టి సారించాలని చెప్పారు. నీటి తీరువా వసూళ్లు వేగవంతం చేయాలని ఆమె సూచించారు. నీటి తీరువా వసూళ్లలో ప్రతిభ కనపర్చిన ఘంట ప్రభాకరరావు, అల్లు ప్రసాద్, మైనర్‌బాబులను ప్రత్యేకంగా అభినందించారు.

జోరుగా మట్టి అక్రమ తవ్వకాలు



అనుమతి లేకుండా తిరుగుతున్న మట్టి ట్రాక్టర్

ఉంగుటూరు: మండలంలోని మెట్ట ప్రాంతాలైన తిమ్మయ్యపాలెం, నాచుగుంట, వెల్లమిల్లి, నల్లమాడు, గొల్లగూడెం తదితర గ్రామ పంచాయతీ పరిధిలో మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. కూటమి నాయకులే తవ్వకాలకు పాల్పడుతున్నారు. అనుమతులు లేకుండా భూమార్పిళ్లు చేస్తున్నారు. తిమ్మయ్యపాలెం శివారు కొత్తగూడెం గ్రామ పరిధిలో మట్టి తవ్వకాలు పొక్లయినర్లతో తవ్వి లారీలతో మట్టిని తరలిస్తున్నారు. రాత్రి సమయాల్లో తవ్వి పట్టుకుపోతున్నారు. ఆదివారం రాత్రి ఈ తవ్వకాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. ఇళ్ల స్థలాలకు కేటాయించిన భూమిలో హౌసింగ్ డిపార్టుమెంట్ ద్వారా రూ.5 లక్షల వ్యయంతో మెరక చేసిన దాంట్లో తవ్వి పట్టుకుపోయారు. కోర్టు పరిధిలో ఉన్న ఈ స్థలాలు లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. విషయం తెలుసుకున్న అధికారులు తవ్విన ప్రాంతానికి వెళ్లారు. అక్కడ ఆనవాళ్లు మాత్రమే అధికారులకు కనిపించాయి. ఈ విషయంలో తవ్విన వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. మెట్ట ప్రాంతాల్లో వీఆర్‌వోలు పహారా తిరిగేలా ఏర్పాట్లు చేశామని తహసీల్దార్ వివరించారు. మట్టి తవ్వితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదిలా ఉండగా పోలవరం కుడి కాలువ గట్లపై దోచుకున్నోళ్లకు దోచుకున్నంత అన్న చందంగా కంకర పట్టుకుపోతున్నారు. నల్లజర్ల సరిహద్దు నుంచి డి.తిరుమల మండలం వరకు ఉంగుటూరు మండలం పరిధిలో 16 కిలోమీటర్లలో ఉన్న కంకర గుట్టలు మూడింట రెండొంతులు ఇప్పటికే పట్టుకపోగా మిగిలిన కంకర తరలించేస్తున్నారు. నల్లమాడు రెవెన్యూ పరిధిలో నాలుగు జేసీబీల సాయంతో తవ్వకాలు సోమవారం సాయంత్రం మొదలు పెట్టారు. రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు తెలుస్తోంది. డెల్టా గ్రామాల్లో అనుమతులు లేకుండా మట్టిని ట్రాక్టర్లపై తరలిస్తున్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ



దెందులూరు: వంటకాలను రుచి చూస్తున్న ఎంఈఓ అన్నమ్మ



నిడమర్రు: పోటీలోని ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఎంఈవో భాస్కర్ కుమార్

దెందులూరు: విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యం లక్ష్యంగా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న వంట నిర్వాహకులు, సహాయకులు అంకితభావంతో పని చేయాలని మండల విద్యాశాఖ అధికారిణి కె.అన్నమ్మ అన్నారు. బుధవారం దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వడ్లపట్ల విజయకుమార్ అధ్యక్షతన వంట నిర్వాహకులు, సహాయకులకు ఒక రోజు శిక్షణ సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, గొల్లపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎండీఎం నిర్వహకులకు పోటీలు

నిడమర్రు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించడంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహకులు కృషి చేయాలని ఎంఈవో–2 భాస్కర్‌కుమార్ అన్నారు. మంగళవారం నిడమర్రు గాదిరాజు గోపాలకృష్ణంరాజు జెడ్పీ స్కూల్లో ఎండీఎం నిర్వహకులు, సహాయకులకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. నిర్వాహకులకు వంటకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. హెచ్‌ఎం శివగోపి, ఆళ్ల నరేష్, నాని పాల్గొన్నారు.

యోగాంధ్రలో భాగస్వాములు కావాలి



భీమడోలు: యోగా పోటీల్లో పాల్గొన్న మహిళలు



ఉంగుటూరు: ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు



పెదవేగి: యోగాను అభ్యసిస్తున్న పోలీసులు

భీమడోలు: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నదే యోగాంధ్ర కార్యక్రమ లక్ష్యమని ఎంపీడీవో సీహెచ్ పద్మావతీదేవి అన్నారు. భీమడోలు గ్రామ పంచాయతీ వద్ద పంచాయతీ స్థాయిలో గెలుపొందిన యోగా విజేతలకు మండల స్థాయిలో యోగాసనాలు, ప్రాణాయమం, ధ్యానం వంటి అంశాలపై పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా 19 నుంచి 35 ఏళ్ల లోపు విజేతలకు యోగాసనాలు వేసి చూపరులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, మండల పరిశీలకుడు, యోగా ఆయుష్ ఇంచార్జి, కొవ్వలి వైద్యాధికారి ప్రభులు పరిశీలించారు. ఈ నెల 4వ తేదీన మండల స్థాయిలో 10 నుంచి 19 ఏళ్ల లోపు చిన్నారులకు పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో యోగా ట్రినర్ సత్యేంద్ర, గ్రామకార్యదర్శి కేవీ తనూజ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలీసుల యోగాభ్యాసం

పెదవేగి: అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21ని పురస్కరించుకొని మంగళవారం పెదవేగి పోలీసులు సామూహిక యోగాసనాల సాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు యోగా ప్రాముఖ్యతను వివరించారు.

యోగాతో రోగాలు దూరం

ఉంగుటూరు: యోగాతో రోగాలను దూరం చేసుకోవచ్చని ఎంపీడీవో రాజ్‌మనోజ్ అన్నారు. మంగళవారం గ్రామ పంచాయతీ సర్పంచి బండారు సింధు, ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగా అభ్యాసకులు, ప్రజలు, ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో రాజ్‌మనోజ్ మాట్లాడుతూ యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. మంద జయలక్ష్మి, పెద్దిరాజు, ఆంజనేయ ప్రసాదు, అడపా శోభారాణి, రవికుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమడోలు: సెక్షన్‌లోని పూళ్ల సబ్‌స్టేషన్ పరిధిలోని మొక్కలు తొలగింపు, కొత్త లైన్ల ఏర్పాటు నిమిత్తం ఈ నెల 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శివాజీ మంగళవారం రాత్రి తెలిపారు. పూళ్ల సబ్‌స్టేషన్ పరిధిలో కురెళ్లగూడెం, పెదలింగంపాడు, చిన్నలింగంపాడు గ్రామాల ప్రజలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

మద్దిలో పూజలు

జంగారెడ్డిగూడెం : గుర్వాయిగూడెం మద్ది ఆలయంలో మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.2,23,162 సమకూరినట్టు ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు. నిత్యాన్నదాన సత్రంలో సుమారు 2000 మంది అన్నప్రసాదం స్వీకరించారని ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ తెలిపారు.

సీతంపేటలో ప్రారంభమైన ఉత్సవాలు

కొయ్యలగూడెం: సీతంపేట గ్రామంలో కొలువైన శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి శివాలయంలో మంగళవారం నుంచి ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. తొలి రోజు గణపతిపూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, అగ్ని మధనం తదితర పూజలు చేశారు. శ్రీ చండీశ్వర శివలింగంతో పాటు వినాయక, కాలభైరవ, జంట సర్పదేవతలతో పాటు ప్రతిష్ఠించనున్న వివిధ దేవతామూర్తుల విగ్రహాలకు జలాధివాసం, క్షీరాధివాసం, తదితర పూజలు శాస్త్రోక్తంగా అర్చకులు నిర్వహించారు. హోమశాల వద్ద హోమగుండంలో ద్రవ్యాలను సమర్పించారు.